
# అంటరాని ప్రేమ

-జిలుకర శ్రీనివాస్

**నేను పరువు తీశానట! తలెత్తుకోకుండా చేశానట! మరి నా బతుకుని నాశనం చేసిందెవరు? నా కలల్నీ జీవితాన్నీ కూల్చేసింది వాళ్ళు కాదా?! బెదిరించి భయపెట్టి బుజ్జగించి ఎంతకీ విననంటే కాళ్ళు పట్టుకు బతిమిలాడింది వాళ్ళు కాదా!? ఎవరికి చెప్పుకోను నా బాధని. నా కన్నీళ్ళని. ఈ వెన్నెల ఎంత వెగటుగా అనిపిస్తుంది. కాకపోతే ఆ చేతుల స్పర్శ లేకుండా, ఆ పెదాల అమృతం లేకుండా ఈ వెన్నెల చల్లని గాలి ఏ మాత్రం ఆహ్లాదాన్నివ్వగలవు? ఎలా మరిచేది, ఆ గొప్ప తేజస్సుని.**

**ప్రేమని. నన్నెంతగా ప్రేమించాడు!**



ఊపిరాడకుండా అధరాలతో బంధించేవాడు. నా పాదాలను మునివేళ్ళతో మీటుతూ నా పిక్కెలపై మెత్తుగా ముద్దిడుతూ ఆ వెన్నెల రాత్రుల్లో ఎన్ని కవితలు చెప్పేవాడు. పరవశించి నా కౌగిలిలో మత్తుగా ఎంత మధురంగా పాడేవాడు. నా మురళి. నా సర్వస్వం.

ఎలా విడువగలిగాను. నా ప్రాణాన్ని ఒంటరినిచేసి.

తీరని అన్యాయం చేసి. ఇంకా ఎలా జీవించి ఉన్నాను? తాను నవ్వినపుడు తారకలు తళుక్కుమనేవి. మాటాడినపుడు అమృతం నాలో ప్రవహించేది. అవును మీకు తెలీదు.

నా మురళి ఒక తీయటి చెరుకుగడ. గొప్ప ప్రేమమూర్తి.

నేనెప్పుడూ దేన్నీ పట్టించుకునేదాన్ని కాదు. నా చదువు. ఇంటి పని. అమ్మనాన్న. అన్న. చుట్టాలు పక్కాలు. నాలో నేను మాట్లాడుకోవడం. నాదొక చిన్న ఆనంద ప్రపంచం, రోజులెట్లా గడిచాయో నా చదువులూ అట్లే గడిచాయి. డిగ్రీ దాకా వచ్చేటప్పటికి గానీ నే చూడని ప్రపంచం కనిపించలేదు.

కలలు జీవితాలు ఎందుకు ఆనందంగా రూపొందుకుంటాయో తెలీదు. నాకంత జ్ఞానం కూడా లేదు.

నా మురళి! అవును. నా మురళి కూలిపనులు చేస్తూ కనిపించేవాడు. నాకేమీ తెలీదు ఆ రోజుదాకా. నవ్వుతూ పొలంలో పనిచేస్తున్నాడు. ఆ మాట తీరు ఎంత సంస్కారంగా ఉంది. చూస్తున్నకొద్దీ చూడాలనిపించే మూర్తిమత్వం.

నాకూ ఆదివారం కావడంవల్ల పొలం దగ్గరకు అమ్మతో కలిసెళ్ళాను. అదే మొదటిసారి చూడటం. నా మురళి పనికాడు. పాటకాడు.

మా నాన్న 'ఓరి మురళి! ఆ ఒరాన్ని కాస్త చెక్కరా' కేకేశాడు. ఎంతో పొడవైన ఒరాన్ని చాలా తొందరగా చెక్కి అందంగా తీర్చిదిద్దాడు. బురదలో చిన్నికృష్ణుడిలా ఉన్నాడు. భోజనం చేసేప్పుడు మా అమ్మ చెప్పింది, అతని గురించి.

'మురళీ! నువ్వు హన్మకొండలోనే కదా చదువుతున్నది?' నాన్న అడిగాడు.

'అవునండీ. డిగ్రీ చదువుతున్నాను'

'మా అమ్మాయి కూడా చదువుతుంది మొన్ననే డిగ్రీలో జాయినైంది'

మురళీ చదువుకుంటున్నాడా! నేను ఆశ్చర్యపోయాను. ఇంతకు ముందు ఊరిలో కనిపించినపుడు పెద్దగా పట్టించుకునేదాన్ని కాదు. అందుకే తెలీదు.

ఆ తర్వాత ఒకరజు బస్సెక్కుతున్నపుడు కనిపించాడు. నా చూపు నుండి ఏ రోజు జారిపోనిచ్చేదాన్ని కాదు. మా ఊరి నుండి కాలేజీకి వెళ్ళాలంటే బస్సు ప్రయాణం తప్పదు.

నా చూపుల్ని చూసి చాలా సిగ్గుపడేవాడు. గులాబీలా అతని చెంపలు ఎరుపెక్కేవి.

నా మురళి ఎంత సొగసరి! ఎంత అందగాడు!

నాకు ఆ చెంపల్ని కొరకాలనిపించేది. ఆ మాటే ఆ వెన్నెల రాత్రిలో చెప్తే నన్నెంత కాంక్షగా హత్తుకున్నాడని. ఆ బాహుబలంలో సతమతమయ్యేదాన్ని. ఎంత ప్రేమగా ముద్దాడాడు. నేను ఆ గుండెల మీద పడుకొని ఆ కళ్ళలో కాంతులీనే కోర్కెని చూసేదాన్ని.

అమాయక మురళి! తన పని తప్ప మరేమీ తెలీని మురళి.

నేనే ప్రేమించాను. ఎలా ప్రేమించాను?! నాకేం తెలుసు.

ఇందుకు ప్రేమించానని ఎలా చెప్పేది? ఇది నాకు నచ్చింది కాబట్టి అంటే సరిపోదు. ఏదీ నచ్చుకున్నా ప్రేమించేదాన్నే. ఆ నవ్వు, ఆ కళ్ళు, ఆ తేజస్సు అన్నీ కావాలనిపించింది. సంస్కారం, కోమల మనస్సు, ప్రేమ హృదయం. ఆ కవిత్వం చెప్పే పెదాలు అన్నీ నాకు స్వంతం కావాలనిపించింది.

ఇది నచ్చిందని ఎవరూ ప్రేమించరు. అది హృదయంలో జరిగే సంచలనం. తీయటి స్పృహ. గొప్ప చైతన్యం.

'మురళీ! ఈ రోజు క్లాసుకెళ్ళావా?' ఒకరోజు అడిగాను.

'రోజూ వెళ్ళాలండీ'

'అండీ ఏంటి? ఇంకోసారి అలా పిల్వకు'

తనకు అర్థం కాలేదు. ఆ ముద్దు మోములో అర్థం కాలేదనే ఫీలింగ్.

'సర్లేగానీ! నాకు కొంచెం పనుంది. నాతో చౌరస్తాకొస్తావా?'

కాదనలేకపోయాడు. ఇద్దరం కలిసి చౌరాస్తాలో షాపింగ్ చేశాము.

'పనుందంటే ఏదో పుస్తకాల పని అనుకున్నాను. ఇలా బట్టల షాపుకు పట్టుకొస్తావనుకోలేదు' అన్నాడు.

చెప్పే రాడనుకోని చెప్పలేదు. అయినా ఎంత చక్కటివి సెలెక్టు చేశాడు. అమ్మ కూడా వాటిని చూసి మురిసిపోయింది.

'మురళీ! డ్రెస్ బాగుందట. అమ్మ కూడా మెచ్చుకుంది.'

'నువ్వేది వేసుకున్నా బాగానే ఉంటుంది' అన్నాడు.

'కాదు నీ సెలెక్షన్‌కి థాంక్స్'

నవ్వాడు. చిర్నవ్వు నవ్వాడు. ఆ నవ్వులో ఎంత మెరుపుంది!

సూర్యుడి లేతకిరణం పగిలితే వచ్చిన మెరుపు.

నాకు తెలీకుండానే తన చుట్టూ నా కలలు అల్లుకున్నాను. పగలూ రాత్రీ ఏ పని చేస్తున్నా, చదువుకుంటున్నా అతని తలంపే.

కనిపించకపోతే దిగులుగా ఉండేది. ఆకలేసేది కాదు. నిద్ర రొచ్చేది కాదు. బేలగా మారిపోయేదాన్ని.

తనకేమీ తెలినట్టుండేవాడు. తన లోకం తనది. రోజూ కనిపించినా మాటాడుకున్నా స్నేహం తప్ప ఏదీ కనిపించేది కాదు. నా పట్ల గౌరవం కనిపించేది. ఆ కళ్ళు నన్ను గొప్పగా చూసేవి.

ఒకరోజు మా ఇంటికి రమ్మన్నాను. ఎందుకన్నాడు. నువ్వు రా చెప్తానన్నాను. సెలవు కావటంవల్ల కాలేజీకి వెళ్లలేదు. అమాయకంగా ఒప్పుకున్నాడు.

అద్దం ముందు ఎన్నిసార్లు నన్ను నేను చూసుకున్నాను. ఇంట్లో అందరూ బావి దగ్గరకెళ్ళారు. వాడంతా శూన్యంగా ఉంది. మా కోసమే. నా ప్రేమ కోసమే. ఆ కాలాన్నీ, ఆ ప్రాంతాన్నీ బృందావనంలా మార్చి వెళ్ళిపోయారు.

తానొస్తాడు. ఏం చేయాలి? తోచట్లేదే!

చెప్పేయాలి! నా ప్రేమను చెప్పేయాలి. నువ్వు తప్ప నాకేమీ అక్కర్లేదని ఆ గుండెల మీద వాలిపోవాలి.

ఆ పెదాల్ని ముద్దుపెట్టుకోవాలి.

ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నాకు మా వీధి తలుపు కిర్రుమన్నది వినిపించింది.

మురళి వస్తున్నాడు! ఎంత చక్కటి జుట్టు. మెరుస్తున్నది. మెత్తటి పట్టులాగా ఉంది. ఈ రోజింకా ముద్దొస్తున్నాడు. ఎదురుగా వెళ్ళి 'వస్తావో రావో అనుకుంటున్నా' అని వీధి తలుపులేసి వచ్చాను.

ఇంట్లో కూచోబెట్టి కబుర్లు ప్రారంభించాను.

ఆ మాటా ఈ మాటా మాట్లాడి 'మురళీ! నువ్వెవరినైనా ప్రేమిస్తున్నావా?'

'బలేదానివి! నన్నెవరు ప్రేమిస్తారు?' నవ్వుతూ చెప్పాడు.

'నేనడిగింది, నువ్వెరినైనా ప్రేమిస్తున్నావా అనీ'

'లేదు' అన్నాడు.

అబద్ధం. తాను నన్ను ప్రేమిస్తున్నాడు. అది నాకు మాత్రమే తెలుసు. అది నా మురళికి తెలీదు. నిజంగా తెలీదా?

నన్ను ప్రేమించకపోతే నా పిలుపు మన్నించి ఎందుకొచ్చాడు?

నా మీద ప్రేమతోనే కదా! నన్ను కోరే కదా!

'నువ్వెరినైనా ప్రేమిస్తున్నావా' అడిగాడు.

ఎలా చెప్పేది? నిన్నేనని. ఆ భావాన్ని తెలిపేందుకు ఏ మాటలు సరిపోతాయి? ఔనన్నట్టుగా తలూపాను.

కుతూహలంగా 'ఎవర్ని' అడిగాడు. నా ముందుకు వంగి, నా మొహంలో సిగ్గుని వెతుకుతూ. నా కళ్ళని చూస్తూ...

నాకేమీ తెలీదు. నా పెదాలు వాటికవే తనను ముద్ద చేశాయి. అబ్బ! నా తొలి ముద్దు ఎంత తీయగా ఉంది.

బెదిరిపోయాడు. అదిరిపోయాడు. లేడిపిల్లలా దూరంగా జరిగాడు.

నేనొదల్లేదు - నావేపు లాక్కున్నాను.

తాను కుదరదన్నాడు. కులాలు సరిపోవన్నాడు. బతిమిలాడాడు.

ఐనా నే విన్లేదు. నువ్వు లేకుంటే చస్తానన్నాను, బెదిరించాను. ఏడ్చాను. ఎన్ని మాట్లాడానో! ఏమ్మాట్లాడానో ఎలా చెప్పేది! పిచ్చిగా 'నువ్వే నా ప్రాణం' అరిచాను. కాళ్ల పట్టుకున్నాను.

కరిగిపోయాడు. నాలో వొదిగిపోయాడు.

ఆ కౌగిటిలో ఎంతసేపున్నానో నాకే తెలీదు.

ఆ అధరాలకు ఎంత నైపుణ్యం! ఎంత అపురూపంగా కదిలాయి. ఎలా వచ్చింది. అంత నేర్పు వాటికి?

ఆ చేతుల్లో ఆ పెదాల్లో ఈ జీవితం ఎంత సుఖించిందని!

ఆ తర్వాత దొంగతనంగా పెళ్ళి! అదిరిపడ్డాము. నా మురళి మీద వాళ్ళు కేసు పెట్టారు, నన్ను కిడ్నాప్ చేశాడని.

తప్పలేదు. మొదట ఇద్దరమూ వొణికిపోయాము.

ధైర్యంచేసి, డైరెక్టుగా సిఐ దగ్గరకే వెళ్ళాము.

నా ఇష్టంతోనే వెళ్ళానని, పెళ్ళి చేసుకున్నానని చెప్పాను. సిఐ నా ధైర్యానికి ఆశ్చర్యపోడు. మేజర్లం కాబట్టి ఏమీ చేయలేకపోయారు.

మా అమ్మ నాన్న మమ్మల్ని చూసి మండిపడ్డారు.

అమ్మ నాపై పడి ఏడ్చింది. నాకూ ఏడ్పొచ్చింది.

మా నాన్న, సిఐ ముందే మురళిని చంపేస్తానని బెదిరిస్తున్నాడు.

మా అమ్మ బతిమాలింది నేను వినలేదు.

నాన్న బెదిరించాడు. అయినా మారలేదు. నన్నెక్కడ లాక్కుపోతారోనని నా మురళి బెదురుతున్నాడు. మాటిమాటికి నావైపొస్తున్నారు.

నాన్న 'దూరంగా పో... లం....' తిడుతున్నాడు.

'మాలనా కొడకా! నా బిడ్డ కావల్సి వచ్చిందిరా!' రోషంతో ఊగిపోతున్నాడు.

ఎంత ధైర్యం. నా మురళిని తిడ్తాడా? కోపాన్ని ఆపుకోలేకపోయాను. మా అమ్మని నాన్నని బెదిరించాను. ఇంకోమాట అన్నారంటే మర్యాద దక్కదని వూగిపోయాను.

సి.ఐ. వాళ్ళని సముదాయించి పంపించారు.

'జాగ్రత్తగా కాపురం చేసుకోండి...' హితవులు చెప్పి పంపించారు.

ఓ రోజు... చిన్న చీటీ మీద 'నేను సర్టిఫికెట్లు తీసుకురావడానికి మా ఇంటికి వెళ్తున్నా. తప్పకుండా వెంటనే వస్తాను. నా గురించి భయపడకు. నాకేమీ కాదు. నువ్వు భయపడకు - నీ రాధ' రాసి ఉంచాను. వచ్చేశాను. నన్ను చూసి అమ్మ బోరుమంది.

నాన్న, అన్నలిద్దరూ 'మళ్ళీ ఎందుకొచ్చావు? మేము చచ్చామో బతికామో చూద్దామని వచ్చావా?' కోపగించారు. నాకేడ్పొచ్చింది. ఏడ్చేశాను. నా ఏడుపు చూసి నాన్న ఏడ్చాడు.

సాయంత్రమైంది. నేను వెళ్ళాలి. వెళ్తానంటే ఒప్పుకోరు. మురళి నా కోసం చూస్తాడంటే వాడి పేరు ఎత్తకంటారు. ఇక్కడి నుండి కదలకంటారు. కదిలేత్ అందరమూ చస్తామంటారు.

నా మురళి అక్కడ నా కోసం ఎంత వెదుకుతుంటాడో! నేను కనిపించక పిచ్చి పట్టి ఉంటాడు.

'నువ్వు చెప్పవే' అని అమ్మను కొట్టటం ప్రారంభించాడు. ఎందుకు కొడ్తావంటే, 'నువ్వు వినకపోతే మీ అమ్మను చంపి నేనూ చస్తాన'టాడు.

కాని, నా మురళి గురించి ఎవ్వరికీ పట్టదేం?!

'చస్తే చావండి! నేనెళ్తున్నా' అని వీధి తలుపు దగ్గరకొచ్చాను. మా అన్న నా జుట్టుపట్టి మొహం మీద చెళ్ళున చెరిచాడు. అలా కొడ్తూనే ఉన్నాడు. స్పృహ తప్పాను.

నాకు మెలకువ వచ్చేటప్పటికి గదిలో వున్నాను. చెప్పినట్టు వినకపోతే మురళిని చంపేస్తానన్నారు.

నేనూ చస్తానన్నాను. పీడ విరగడవుతుందన్నారు.

'అయినా నా బతుకు నా ఇష్టం. మీరెవరు కాదనడానికి?' నిలదీశాను. మళ్ళీ తన్నులు తప్పలేదు. 'పరువు ఎలాగూ పోయింది. వాణ్ని చంపితే కొత్తగా పోయేదేమి వుండదన్నారు'

ఆయన్ని ఏమీ చేయొద్దని వేడుకున్నాను.

గదిలో పెట్టి బంధించారు.

నా కోసం మురళి ఎంత బెంగపడ్డాడో. ఏమీ తోచక బిక్కుబిక్కుమంటున్నాడు కావొచ్చు. ఎలా ఈ జైలు గోడల నుండి బయటపడేది!

అయ్యో! నా వెర్రితండ్రే! నిన్నెలా చేరేది?

నా మురళి అన్నిచోట్లా తిరిగాడు. చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశాడు, 'నా పెళ్ళాన్ని కిడ్నాప్ చేశారని'

నాకు ఆనందం వేసింది. నా మురళి తెలివిగలవాడు.

మళ్ళీ నే నా గొప్ప తేజస్సును చేరుకుంటానన్న నమ్మకం కలిగింది. సి.ఐ. మా నాన్నని పిలిచి మాట్లాడాడు.

నాకేమి జరుగుతుందో తెలియనివ్వటంలేదు.

గది నుండి బయటికి రానివ్వటంలేదు.

సి.ఐ.కి డబ్బులిచ్చినట్టు మా నాన్న మాటల్నిబట్టి అర్థమయింది.

వారం రోజులకి కోర్టు నోటీసు వచ్చింది. నన్ను కోర్టుకు హాజరుపర్చాలని. లేకుంటే చట్టరీత్యా చర్య తీసుకోబడ్తుందని. డిసెంబర్ 8న కోర్టుకు రావాలని ఆదేశం.

నాకు ఆనందం వేసింది.

నా కోసం నా మురళి చేస్తున్న ప్రయత్నాలు గొప్ప సాహసంగా కనిపించాయి. రాక్షసులెత్తుకుపోయిన యువరాణి కోసం యుద్ధం చేస్తున్న రాకుమారుడిలా కనిపించాడు.

కోర్టుకు హాజరు కావాల్సిన రోజు రానే వచ్చింది.

కాని! నన్ను తీసుకుపోలేదు. నాన్న, అన్న వెళ్ళారు. నన్ను తీసుకుపోండని బతిమిలాడాను. ఏడ్చాను.

నా ఏడ్పు ఎవ్వర్నీ కరిగించలేక పోయింది. వెర్రిగా మిగిలింది.

నాకు ఆరోగ్యం బాగోలేదని, మరికొంత గడువు కావాలని ఈ దుర్మార్గులు కోర్టును కోరారు. ఆ రాక్షస కోర్టు అందుకు అంగీకరించింది.

నేనొస్తానని, ఎదురుచూసిన నా మురళి నీరుగారిపోయాడు. కోర్టు నిర్ణయంతో రెక్కలు తెగినవాడిలా నేలకు రాలిపోయాడు.మురళీ! ఎంత పనిచేశావు? నేను రానను కొని, ఇక దక్కను అనుకోని ఎంత పని చేశావు. మా వాళ్ళ కుట్రలు చూసి విసిగిపోయావా?

నేను నీ పక్కన లేకపోయేసరికి నీ శక్తినంతా కోల్పోయావా?

మర్నాడు పత్రికలో నా మురళి మరణవార్త.

నా శరీరం కుంచించుకుపోయింది. దుఃఖం బద్దలైంది. కసి. అందరి మీద కసి. కోపం. అసహ్యం. ఈ మనుషులు కంపు కొడ్తున్నారు.

పత్రికలో ఆ ఫోటో చూసి నా ప్రాణం విలవిల్లాడింది.

నాకు ముద్దులిచ్చిన ఆ నోటి నిండా రక్తంకారిన చారలు. ఆ గులాబీ చెక్కిళ్ళు కమిలిపోయాయి. నన్ను సేదదీర్చిన ఆ వక్షం శ్వాసించడం ఆగిపోయింది.

నా ప్రపంచం కూలిపోయింది.

నా మురళి చచ్చిపోయాడా? కాదు చంపేశారు.

నా వాళ్ళు. సంఘం. నీతి. కులం. పోలీసులు కోర్టు అందరూ అందరూ కలిసి చచ్చేలా చేశారు.

నా కలల పుప్పొన్ని గొంతు పిసికి చంపేశారు.

నేను లేకుండా జీవితం వద్దనుకున్నావా?

అయ్యో! నా కోసం ఎంత కష్టం అనుభవించావు. హింసను భరించావు. పాపిష్టిదాన్ని! నిన్ను పోగొట్టుకున్నాను.

ఈ మనుషుల మీద, ఈ కుళ్ళు మీద తిరస్కారంతో నేను లేని బతుకొద్దని అందర్నీ, అంతటినీ ఒక్క తన్ను తన్ని వెళ్ళిపోయాక నేను మాత్రం ఎలా ఉండగలను!

వీళ్ళందరికీ ఒకేఒక మాట చెప్పి వస్తున్నా. నీ దగ్గరికే.

'ప్రేమించలేని మీ మలిన గుండెను కడుక్కోండి'

నా గొంతును దాటిన విషం నన్ను నేలకు బాదింది. కళ్ళు చీకట్లు కమ్ముకున్నాయి. అబ్బ! మృత్యువెంత కఠినంగా ఉంది. నా మురళీ, నువ్వు కూడా ఇలా గింజుకున్నావా?! తన్నుకున్నావా?

మరణించిన నేను కళ్ళు తెరిచేటప్పటికి ఆసుపత్రిలో ఉన్నాను. అయ్యో నేను చావలేదా?!

'ఎందుకే మా పరువు తీస్తావు?' - మా నాన్న చింతనిప్పుల్లాంటి కళ్ళతో అరుస్తున్నాడు. ★